# సమాజానికి కానుక

రాత్రి 9.10 గంటలమధ్య...

ఒక టాక్సీ రివ్వున దూసుకొచ్చి మాలతీ నర్సింగ్ హోం ముందు ఆగింది.

అందులోంచి ముందు ఓ నలభై ఐదేళ్ళ వ్యక్తి దిగాడు. దిగుతూనే అతను వెనక్కి వచ్చి బ్యాక్ డోర్ తీశాడు. ఇద్దరు స్త్రీలు ఒకమ్మాయిని పట్టుకుని కారులోంచి దింపారు.

ఆ అమ్మాయి వయసు 18-20 సంవత్సరాల మధ్య ఉంటుంది. చామన ఛాయ. కాని కళగా ఉంది ఆమె మొహం. దిగులో, బాధో తెలియదుకానీ... కళకళలాడే ఆ మొహంలో ఏదో వెలితి కన్పిస్తోంది.

ఇద్దరు స్త్రీలలో ఒకామెకి యాభై ఏళ్లు దాటి ఉంటాయి. ఇంకొకామెకి ముప్పయి ఐదేళ్ళ వయసుండవచ్చు. వారిద్దరూ ఆ అమ్మాయిని చెరో చేత్తో పట్టుకుని మెల్లిగా నడిపిస్తూ లోపలికెళ్ళారు.

ఆ వ్యక్తి టాక్సీ మీటరు చూసి జేబులోంచి పర్స్ తీసి డబ్బులు ఇచ్చాడు డ్రైవర్‌కి. అతనిచ్చిన చిల్లర మళ్లీ పర్సులో వేసుకొని ముందు నడుస్తోన్న వారిని అనుసరించాడు.

అందంగా పెంచిన లాన్, పొడుగాటి అశోక చెట్లు... అందమైన పూలమొక్కలు దాటుకుంటూ కారిడార్‌లోకి వచ్చారు.

హాస్పిటల్ ప్రశాంతంగా ఉంది. అశోక చెట్లు గాలికి గంభీరంగా, నిశ్శబ్దంగా కదులుతున్నాయి.

పొడుగాటి కారిడార్‌లో రెండుప్రక్కలా వరసగా గదులున్నాయి. ఆ గదుల్లో పేషెంట్స్ నిశ్చింతగా నిద్రపోతున్నారు. ఒకరిద్దరు నైట్ డ్యూటీ నర్సులు అటూ ఇటూ తిరుగుతూ ఆ టైంలో పేషెంట్స్‌కి ఇవ్వవలసిన మందులు,

ఇంజక్షన్‌లు చూసుకుంటున్నారు.

నలుగురూ ఆ గదులన్నీ దాటి కుడి ప్రక్కకు తిరిగారు. అటువైపు విశాలమైన గది ఒకటి ఉంది. ఆ గదికి పెద్దపెద్ద పూలున్న కర్టెన్ వేలాడుతోంది. నలుగుర్లో ఆ వ్యక్తి ముందుకెళ్లి డోర్ మీద వేళ్ళతో సున్నితంగా కొట్టాడు.

''యస్... కమిన్!'' సుమధుర స్వరం గంభీరంగా విన్పించింది. నలుగురూ లోపలికెళ్లారు.

''నా పేరు గాయత్రి...'' నమస్కారం చేస్తూ తనని తను పరిచయం చేసుకుంది. ఆ అమ్మాయి తల్లి.

''ఓ డాక్టర్ లావణ్య రెఫర్ చేసిన కేసా! ప్లీజ్ సిట్ డౌన్!'' ఆవిడ నలుగురికి కుర్చీలు చూపించింది.

''ఈ అమ్మాయి మా అమ్మాయి. పేషెంట్... తనే...'' గాయత్రి అమ్మాయిని చూపిస్తూ అన్నది.

ఆ అమ్మాయి తల వంచుకుంది. తప్పు చేసినదాన్లా కుంచించుకుపోతూ కుర్చీలో ముడుచుకు కూర్చుంది.

''అమ్మా! మాది ఎంతో గౌరవనీయమైన కుటుంబం. సంప్రదాయాలకు... ఆచారాలకు పేరు పొందిన వంశం... ఇలా జరగడం మా దురదృష్టం. మీరెలాగైనా మమ్మల్నీ ఆపదనుంచి గట్టెక్కించాలి'' ఆ అమ్మాయి అమ్మమ్మ కాత్యాయిని రుద్ధమైన కంఠంతో వేడుకోలుగా అంది.

డాక్టర్ మాలతి నిశ్శబ్దంగా పేపర్ వెయిట్ కదిలిస్తూ ఆవిడ చెప్పేది వింటోంది.

''డాక్టర్! బహుశా మీకు లావణ్యగారు మా గురించీ, జరిగిన ఘోరం గురించీ మీకు చెప్పే ఉంటారు. ఇది... ఇది కేవలం... యాక్సిడెంటల్. మా దురదృష్టం...'' గాయత్రి కంఠంలో ఆవేదన, దుఃఖం.

''ఎన్నో నెల?'' అడిగింది మాలతి.

''సరిగా చెప్పలేను...'' గాయత్రి కంఠంలో అస్పష్టత.

మాలతి ఆ అమ్మాయివైపు చూసింది. వాలిన కనురెప్పలమీదినుంచి నున్నటి ఆమె చెక్కిళ్ళ మీదికి జారుతున్నాయి కన్నీటి బిందువులు. దుఃఖాన్ని ఆపుకోటానికి విశ్వప్రయత్నం చేస్తోంది అన్న దానికి నిదర్శనంగా ఆమె పెదాలు పంటిక్రింద నలుగుతూ రక్తాన్ని చిందిస్తున్నాయి. మాటిమాటికి

కన్నీళ్ళు తుడుచుకోవడం వల్లకాబోలు చెక్కిళ్ళు ఎర్రగా కందిపోయి ఉన్నాయి.

మాలతికి చాలా జాలేసింది.

ఆడపిల్లలెంత అమాయకులు! వారి కళ్ళల్లోని అమాయకత్వం, హృదయంలోని కారుణ్యం... మనసులోని సున్నితత్వం, మాటల్లోని లాలిత్యం మగవాడికి ఆటవస్తువులు. వీటి ఆధారంగానే కదా మగవాళ్ళు వీళ్ళ జీవితాలతో చెలగాటాలాడేది... అపురూపమైన జీవితాలను అల్లరిపాలు చేసేది. నాశనం చేసేది... నిట్టూర్చింది మాలతి.

పెద్దవాళ్ళు ముగ్గుర్నీ చూస్తూ అన్నది. '' ఏమీ అనుకోకపోతే మీరంతా కాసేపు బైట కూర్చుంటారా?''

వాళ్ళు ఓక్షణం ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకుని, నిశ్శబ్దంగా లేచి బైటికెళ్ళిపోయారు.

ఆ అమ్మాయి బెదిరిపోతూ తలెత్తింది. అప్పుడు చూసింది మాలతి ఆ కళ్ళని... కన్నీటి జలాశయాలను... కుర్చీలోంచి లేచి ఆ అమ్మాయిని సమీపించి, భుజంమీద చేయి వేసి ఆప్యాయంగా అడిగింది...

''నీ పేరేమిటమ్మా?''

''శ్రా... శ్రావణి...'' వెక్కిళ్ళ మధ్య చెప్పింది.

''శ్రావణి... వెరీగుడ్ నేమ్... ఏం చదువుకున్నావు?''

''డిగ్రీ సెకండియర్‌లో ఉన్నాను''

ఇంకా జీవితంలో మొదటి మెట్టు కూడా ఎక్కలేదు. అప్పుడే జారిపోయింది జీవనభాండం.

''ఎలా జరిగింది?''

ఆ అమ్మాయి మాట్లాడలేదు. తల వంచుకుంది. జరిగిపోయిన అత్యంత దారుణమైన ఆ సంఘటన మరోసారి కళ్ళముందు కదిలిందేమో... ఒక్కసారిగా బావురుమంది.

''ఏడవకమ్మా... రిలాక్స్... ప్లీజ్'' ఆమె తల నిమురుతూ మార్దవం నిండిన స్వరంతో అన్నది.

ఆ కాస్త ఆప్యాయతకే శ్రావణి చలించి పోయింది. గువ్వపిట్టలా ఆవిడ గుండెల్లో ఒదిగిపోతూ వెక్కివెక్కి ఏడవసాగింది.

''డాక్టర్...! నాకు భయమేస్తోంది.... నేను చచ్చిపోతాను... నన్ను

చంపేయండి... లేకపోతే నన్నందరూ అసహ్యించుకుంటారు... ఈ నాగరిక సమాజాన్నుంచి నన్ను వెలివేస్తారు... డాక్టర్! ప్లీజ్ నన్ను చంపేయండి''

''తప్పమ్మా... తప్పు. ప్రతి సమస్యకి చావే పరిష్కారం కాదమ్మా... ఈ బ్రతుకు నీది. నిన్నెవరు అసహ్యించుకున్నా, ద్వేషించినా నువ్వు బ్రతకాలి. బ్రతికి తీరాలి. నువ్వే తప్పు చేయలేదమ్మా''

చాలు... ఆ కాస్త ఊరడింపు.. ఈ కాస్త ఆప్యాయత... ఈ మాత్రం ధైర్యం చాలు...

ఆ సంఘటన జరిగిన దగ్గర్నించీ అమ్మా, నాన్నా, అమ్మమ్మా అందరూ తనని అసహ్యించుకుంటున్నారు... అయిన దానికి, కాని దానికీ తిడుతున్నారు. ఇరుగు పొరుగువాళ్ళు, ఫ్రెండ్స్, ఎవరూ తనతో మాట్లాడటంలేదు. తనని దాదాపు అంతా వెలివేశారు. ఇంట్లోంచి బైటికి కదలనీయడంలేదు. చదువు అర్థాంతరంగా ఆగిపోయింది. సరదాలూ, షికార్లు లేవు. ఐదు నెలలనుంచీ తన మొహంలో చిరునవ్వు లేదు. పూర్తిగా నవ్వడం మర్చిపోయింది. ఎందుకిలా? ఎందుకిలా జరిగింది?

ఆ సంఘటన జరగడంలో తన పాత్రెంత? ఫ్రెండ్స్‌తో సినిమాకి వెళ్ళడం తన నేరమా? ఆరోజు... ఆరోజు... అలా జరుగుతుందని తను ఊహించిందా?

సరిగ్గా ఆరునెలల క్రితం ఫ్రెండ్స్‌తో కలిసి సినిమాకి వెళ్ళింది. ఉల్లాసభరితమైన మనసుతో హాలు బైటికి వచ్చి అందరూ బస్టాప్‌కి వెళుతుంటే తెలిసింది... ఎవరో ఒక పార్టీకి చెందిన రౌడీలు మరో పార్టీ నాయకులలో ఒకణ్ణి కత్తితో పొడిచి చంపేశారని. ఆ దారుణ మారణకాండ అగ్నిజ్వాలలు నగరమంతా వ్యాపించి ఎన్నో కత్తిపోటు సంఘటనలు, బస్సుల దహనాలూ జరుగుతున్నాయని దావానలం లాంటి వార్త. జనం భయవిహ్వలులై పరుగులు ప్రారంభించారు. నలుగురు స్నేహితురాళ్ళతో కలిసి బస్సుల్లేని ఆ హడావుడిలో తనూ పరిగెత్తింది. ఆటోకోసం కనీసం రిక్షాకోసం. కానీ ఎవరికి వారే ప్రాణభీతితో పారిపోతూ తనని పట్టించుకోలేదు. పరుగెత్తి... పరుగెత్తి అలసి సొలసి పరుగాపి నిస్పృహాయంగా నిస్సత్తువుగా నడవసాగింది. ఆ భయంకర పరిస్థితుల్లో దారి మర్చిపోయింది. చుట్టూ చీకటి... జనసంచారం అంతగా లేదు. ఉండీ, ఉండి ఒకటి అరా కార్లు, స్కూటర్లు 'జర్న' జారిపోతున్నాయి.

ఒళ్లంతా చెమటతో తడిసిపోయింది. కళ్ళనిండా నీళ్ళు, గుండెనిండా దుఃఖం.

అప్పుడే... అకస్మాత్తుగా మీదపడిందో కసాయి చెయ్యి. కెవ్వున అరిచి తిరిగేలోగా నోరు నొక్కింది మరో కబంధహస్తం.

కళ్ళు మూసి తెరిచేలోగా.. పంచేంద్రియాలు స్తంభించి... ఏమయ్యింది తెలుసుకునేలోగా జరిగిపోయిందా దారుణం...

ఒంటిమీద స్పృహలేని తనని ఆ నీచులు రోడ్డుమీద వదిలేసి వెళ్ళిపోయారు. ఇల్లెలా చేరిందో తెలీదు చేరింది. ఆ వార్తెలా చేరిందో తెలీదు... గుప్పున వ్యాపించింది. ఆ తరువాత ప్రారంభమైంది మానసిక చిత్రహింస.

శ్రావణి గుండె పగిలేలా రోదిస్తోంది.

ప్రకృతి స్త్రీకి మాతృత్వాన్ని వరంగానే కాదు... శాపంగా కూడా మార్చింది. పెళ్లైన స్త్రీ మాతృత్వాన్ని మహత్కార్యంగా, అమూల్యమైన సంపదగా భావిస్తే, వంచించబడిన స్త్రీ అదే శాపంగా, తనపాలిటి మృత్యువుగా భావిస్తోంది.

జరిగిన ఘోరంలో శ్రావణి పాత్ర ఎంత...? తన సృష్టికి ఆమె గర్భంలోని శిశువు పాత్ర ఏమిటి? ఆమెనీ స్థితికి తెచ్చిన రాక్షసులు పారిపోయారు. సంఘటన జరిగిన మరుక్షణం నుంచీ పెద్దమనుషులుగా చెలామణీ అవుతూ హాయిగా బ్రతుకుతున్నారు.

ఏ తప్పూ చేయని శ్రావణి అటు మానసికంగా, ఇటు శారీరకంగా నానా చిత్రహింసల్ని భరిస్తోంది.

ఆమె కడుపులో నిశ్శబ్దంగా ప్రాణం పోసుకుంటోన్న ఆ జీవి తన ఉనికిని నిరోధించడానికి ఈ పెద్దలు పడుతున్న పాట్లు... అనుసరిస్తున్న పైశాచిక కృత్యాలు తెలీనిదానిలా, ఓ రూపం సంతరించుకుంటోంది.

సృష్టించడం స్త్రీ ధర్మం... జీవించడం శిశువు ధర్మం... తన సృష్టికి కారణం... నీచులా, దుర్మార్గులా, మంచివాళ్ళా అన్న సమస్య ఆ శిశువుది కాదు... కానప్పుడు తన ఉనికిని ఈ పెద్దలు నిరోధించాలనుకుంటున్నారు అన్న బాధ ఆ శిశువు కెందుకు? ఆ స్త్రీకెందుకు?

తప్పొప్పుల పట్టికలో స్థానాలను నిర్ణయించలేని ఈ సమాజం పెళ్ళికాని తల్లుల్ని. తండ్రిపేరు తెలియని పిల్లల్ని ఎందుకు శిక్షిస్తుంది?

సరిగ్గా ఇరవై ఏళ్ళక్రితం ప్రేమ పేరుతో వంచించబడిన మాలతి పద్దెనిమిదేళ్ళకే ఓ పెళ్ళికాని తల్లైంది. ఆనాటి ఆ ప్రేమఝరిలో తడిసిన ఆ ధరణి గర్భంలోనుంచి ఒక మొలక. తనని మాతృమూర్తిని చేసిన ప్రేమికుడు సర్వం మరిచి అంతర్ధానమైతే ఓ చేత్తో కాలే కడుపును. మరో చేత్తో రక్తపు గుడ్డును పట్టుకుని కన్నవారి నిరాదరణకు గురై ఊరొదిలింది.

ఆత్మవిశ్వాసమే పెట్టుబడిగా, ఆత్మాభిమానమే అర్హతగా జీవితాన్ని ప్రారంభించింది... అంచెలంచెలుగా ఎదుగుతూ సాంఘికంగా తనకో, హోదా కల్పించుకుంది. ఛీ కొట్టినవాళ్ళంతా సలాము చేస్తున్నారిప్పుడు.

మాలతి శ్రావణి చుబుకం ఎత్తి కళ్ళు తుడిచింది. ''ఏడవకమ్మా... మాతృత్వం అనేది వరం. స్త్రీ సృష్టించడం మానేస్తే ప్రపంచం ఏది? ఈ సృష్టి అక్రమమా? సక్రమమా? దీన్ని స్వీకరించాలా... త్యజించాలా అన్నది సమాజం బాధ్యత. నీకు ఐదోనెల వచ్చింది. ఇప్పుడు నీకు అబార్షన్ చేస్తే నీ ప్రాణానికే అపాయం. అందుకే నేనీ అబార్షన్ చేయలేను''

''డాక్టర్!'' స్థాణువులా అయింది శ్రావణి.

''అవునమ్మా... నేనూ నీలాంటి పెళ్ళికాని తల్లినే. కాకపోతే ప్రేమించి వంచింపబడ్డ దానిని నేను. జీవితంలో బలిపశువులా మారిందానివి నువ్వు. మన కథల ముగింపు ఒకటే. పెళ్ళికాని తల్లులం అయి మన బిడ్డల్ని పెంచి, ఆదర్శవంతంగా తీర్చిదిద్ది ఈ దేశానికి అందించడం... రేప్పొద్దున్న నీ బిడ్డ ఇంజనీరో, డాక్టరో, సైంటిస్టో అయితే వారి సేవలను ఉపయోగించుకునేది ఈ దేశం. తండ్రెవరో తెలీని వారి సేవలు ఈ దేశం ఉపయోగించుకుంటుందా? త్యజిస్తుందా అన్న నిర్ణయం దేశానికే వదిలేద్దాం''

''కానీ... కానీ... అమ్మా, నాన్నా. ఈ సమాజం నన్ను బ్రతకనివ్వరు డాక్టర్''

''అమ్మా... నాన్నా. సమాజం ఎవరమ్మా వీళ్ళంతా? నీకు జరిగిన అన్యాయానికి, ఆనాటి సంఘటనకు కారణభూతులైన పార్టీ నాయకులనో, గూండాలనో, ప్రభుత్వాన్నో మూల్యం చెల్లించమని పోరాడవలసిన అమ్మా నాన్నా నీకు న్యాయం చేయమని కోరవలసిన సమాజం... వాళ్ళందరినీ వదిలేసి నిన్ను శిక్షిస్తోందే... ఇదేం న్యాయం! ఇదేం ధర్మం! ఇలాంటి వాళ్ళని లక్ష్యపెట్టవలసిన అవసరం లేదు శ్రావణీ. నీకు ఆత్మవిశ్వాసం, ధైర్యం

ఉండాలి. ఎన్ని అవాంతరాలు, అవమానాలు ఎదురైనా... నువ్వెంచుకున్న మార్గంలో ముందుకు సాగిపోగల గుండెనిబ్బరం నీకుండాలి. ఆ ధైర్యం, స్థైర్యం నీలో ఉన్నంతకాలం నిన్నెవరూ ఏం చేయలేరు. నీకు తోడుగా నేనుంటాను... నీవు చేయని తప్పుకు నువ్వు శిక్ష అనుభవించవలసిన అవసరం లేదు''

''డాక్టర్... మీరు... మీరు చెప్పేది సాధ్యమా? నేను ధైర్యంగా ఉండగలనా?''

''ఆ ప్రశ్న నన్నుకాదమ్మా అడగాల్సింది... నీ అంతరాత్మని అడుగు. ఇందులో నీ తప్పెంత అని నిలదీయమ్మా నీ అంతరాత్మని''

డాక్టర్ మాలతి శ్రావణిని కుర్చీలో కూర్చోబెట్టింది.

''బాగా ఆలోచించుకో శ్రావణీ... నేనిప్పుడే వస్తాను'' అంటూ బైటికి వెళ్ళింది.

సోఫాలో కూర్చున్న ముగ్గురి మొహాల్లోనూ ఆదుర్దా... అసహనం... సంప్రదాయాలూ, ఆచారాలూ... పరువు ప్రతిష్టల నిర్బంధంలో యాభై ఏళ్ళు బానిసగా బ్రతికిన కాత్యాయిని...

అటు అర్థంలేని సంప్రదాయాలతో రాజీపడలేకా. ఇటు ఆధునికతను జీర్ణం చేసుకోలేక సంధిగ్దావస్థలో అడకత్తెరలో పోకచెక్కలా గాయత్రి... తన జాతి అకృత్యాలు తెలిసినా నిరోధించే మార్గం తెలీక అరువు తెచ్చుకున్న సంప్రదాయాలను అవకాశవాదంతో సమర్థిస్తూ ఓ మర బొమ్మలా మారిన గంగాధర్... వాళ్ళ ముగ్గుర్నీ చూస్తోంటే నవ్వొచ్చింది మాలతికి.

''ఏం జరిగింది డాక్టర్?'' ముగ్గురూ ఒకేసారి అడిగారు.

''ఇంకా ఏం జరగలేదమ్మా... మీరు కోరుకున్నట్లు జరిగితే మీ అమ్మాయి మీకు దక్కదు''

''అంటే...!''

'' ఆ అమ్మాయికి ఐదోనెల. ఇప్పుడు అబార్షన్ చేస్తే ఆ అమ్మాయి మృత్యువాత పడుతుంది''

''అయితే... అయితే... మా పరువు, మర్యాద గంగపాలు కావాల్సిందేనా... మేము తలెత్తుకు తిరిగేదెలా?'' కాత్యాయిని గొల్లుమంది.

''మేమంతా కట్టకట్టుకుని ఎక్కడైనా దూకాలి డాక్టర్. దయవుంచి

ఎలాగైనా ఈ ఆపదనుంచి కాపాడండి'' గాయత్రి వేడుకుంది.

''మీకు పరువు ప్రతిష్ఠలు ముఖ్యమా? మీ అమ్మాయి ప్రాణం ముఖ్యమా?'' కఠినంగా అడిగింది మాలతి.

''దరిద్రపు మొహం... దాని కడుపులో దాని పాపానికి ప్రతిరూపం ప్రాణం పోసుకుంటోంది. కులం, మతం, జాతి తెలీని దిక్కుమాలిన సంతానానికి అది తల్లి అవ్వాలా? అంతకన్నా అది చావడమే మంచిది'' గంగాధర్ ఆవేశంగా అన్నాడు.

''దరిద్రపు మొహం.. పాపానికి ప్రతిరూపం. పద్దెనిమిదేళ్ళు మీ కంటి రెప్పలా కాపాడిన ఆ అమ్మాయి తన జీవితంలో జరిగిన దౌర్భాగ్యపు సంఘటనకి దరిద్రపు మొహంగా... పాపానికి ప్రతిరూపంగా అనిపిస్తోందా? ఎవరి పాపానికి ఇంకా భూమ్మీదకు రాని ఆ ప్రాణి ప్రతిరూపం సార్... ప్రకృతి శ్రావణికి ఈ స్థితి కల్పించకుండా ఉండివుంటే... ఆ వెధవల్లాగే ఈ అమ్మాయి కూడా ఏమీ జరగనట్లు హాయిగా తిరిగేది... మీరు తిరగనిచ్చేవారు... కానీ మాతృత్వం, ఆడదాని సుఖానికీ, స్వేచ్ఛకీ అవరోధం. ఆ అవరోధమే... ఆడదానికి ఆనందం. శ్రావణి మిగతా నాలుగు నెలలూ ఆ గర్భాన్ని మోస్తుంది. బిడ్డని కంటుంది. ఈ సమాజంలో క్షణక్షణం జరిగే అనేక చెడు పరిణామాల ఫలితం... ఈ దారుణం... ఈ దారుణానికి ప్రత్యక్షసాక్ష్యం... ఆమె బిడ్డ. ఆ బిడ్డని ఈ సమాజానికి కానుకగా సమర్పిస్తుంది. ఆ కానుకని స్వీకరించాలా? త్యజించాలా అన్న నిర్ణయాన్ని ఈ సమాజమే తీసుకుంటుంది. శ్రావణి భవిష్యత్తుని, ఆమె బిడ్డ భవిష్యత్తునీ ఈ సమాజమే నిర్ణయిస్తుంది. ఆమెకి జరిగిన అన్యాయానికి ఈ సమాజమే తీర్పునిస్తుంది. అందాకా శ్రావణి నా బిడ్డ... నా నిర్ణయాన్ని ఆమోదించే సంస్కారం మీలో ఉంటే లోపలికి రండి... లేదంటే ఇక్కణ్ణించే వెనక్కి వెళ్ళండి...'' గంభీరంగా ఈ మాటలనేసి గిరుక్కున వెనక్కి తిరిగి లోపలికెళ్ళిపోయింది డాక్టర్ మాలతి.

ఆంధ్రప్రభ 'మహిళ' ప్రచురితం